



వారి పేరేమిటో ఎవరికీ తెలియదు. పాఠశాలలో ప్రవేశించింది మొదలు ప్రధానోపాధ్యాయులకు వీడగా మెలుగుతూ వారింట్లో అన్నికార్యాలనూ—తద్దినాంతో సహా పెత్తనం గట్టిగా నడిపించటంవల్ల వారిని అందరూ కరటక శాస్త్రిగారంటారు. చెప్పేది సంస్కృతం, కట్టేది గ్లాస్కో పంచలు. ఆంగ్లపు ముక్కలు కొన్ని నేర్చుకొని వాటితోపాటు ఆధునిక సంస్కారాన్నికూడ వంట పట్టించుకొన్నారు. తల సగం నరిసినా క్రాపింగుజుట్టు తగినట్లుగానే ఉన్నవనుకోవాలి. కొన తేలిన సుమనాసిక పొడుంపట్టువల్ల కొంచెం ఉబికినా ఒడ్డూ పొడుగూ ఉన్న కరటక శాస్త్రిగారి తెలివితేటలకో చిహ్నమనక తప్పదు. విశాలఫాలం, వంపులుతిరిన మీసకట్టు, పెద్దకండ్లు తగినట్లుగానే ఉన్నవి. కావ్యాలన్నీ వారి కిదివరకే కంఠస్థమవడంవల్ల ప్రస్తుతం శైలు వాఙ్మయాన్ని పరిశోధిస్తున్నారు. లౌకిక జ్ఞానంలో అందెవేసిన చెయ్యి. తిరగడంలో తోడావేసిన కాలు. చీట్లాటలో ఆరితేరిన హస్తం. ప్రధానోపాధ్యాయుల వారికి కుడిచెయ్యి, తాళికట్టిన భార్యకు ఎడమచెయ్యి అంకితం చేసినందున క్లాసులో నల్లబల్లపైన వ్రాయడానికి వారికి వీలులేక పోయింది. అందువల్ల ఆ క్లాసులో ఆ బల్ల దుమ్ము కొట్టుకుపోయింది. క్రింద కూర్చోటానికి మొహమాటపడ్డ ఐదోక్లాసు పిల్లలిద్దరు ఆ బల్ల దుమ్ము దులిపి చక్కా పట్టుకుపోయారు

* * *

ఏలాగయినా సరే ఆ సంవత్సరం ఎస్. ఎస్. ఎల్. సి ప్యాసు కాదల్చుకొన్నది వజ్రమ్మ. పొట్ట బొడిచినా అక్షరంముక్క లేదని ఆవిడకూ తెలుసు. కాని ఆ పాఠశాల ప్రత్యేకత, హెడ్మాస్టరుగారి ప్రతిభ అదివరకే విన్నది గనక కార్యసాధనకు నడుంగట్టింది. ఆలోచించి అదను చూచుకొని కరటక శాస్త్రిగారిని నిలబెట్టిందా రోజున. తల వంచుకొని నేలచూపులు చూస్తూ మొదలెట్టింది తన దీన జీవితచరిత్ర. శాస్త్రిగారి చెవులు వింటున్నై, కండ్లు చూస్తున్నై, నాసిక ఆఘ్రాణిస్తోంది, వారి పంచేంద్రియాలు చురుగ్గానే పని చేసుకుపోతున్నై. వంచిన వజ్రమ్మ తల మీది తీర్చిదిద్దిన నొక్కులు శాస్త్రిగారికి సముద్రపుటలలను జ్ఞాపకం చేసినై. అలలు నురుగును స్ఫురింపజేసినై. వెంటనే శాస్త్రిగారికి వారి నెరసినజుట్టు జ్ఞాపకమొచ్చింది. 'ఊఁ' అంటూ శాస్త్రిగారు వజ్రమ్మ వంచిన మెడ, బిగబట్టిన గూళ్ళు, పైకుబికిన వక్షోజాలను వరుసగా చూచి

"సుబ్బన్న"

'పద్మాకంఠి' అనుకొన్నారు. 'శతనాభి' కో నా కాదాయని పరీక్షించారు. కాని చీరె లోపలికి బిగుగా వేసుకొన్న పొడుగు చేతుల పాప్లిన్ షర్టు వారి కడ్డమొచ్చింది. అయితే నేం 'సింహ మధ్యమ' అని తీర్మానించుకొని, ఊరువులు రంభా స్తంభాలని నిర్ణయించబోగా తెల్లవాయిల్ చీరె లోపలి లేసువేసి కుట్టిన లంగా ప్రత్యక్షమైంది. శాస్త్రిగారో నిట్టూర్పు పుచ్చి "ఏమిటి వజ్రం చెబుతున్నావు? అంతా గొడవగా ఉంది. ముక్తసరిగా మూడు ముక్కల్లో అదంతా మళ్లీ చెప్పు" అన్నారు. వజ్రమ్మ తల పైకెత్తి శాస్త్రిగారి ముఖంలోకి ఒక్కమాటు చూసింది. శాస్త్రిగారా అవకాశాన్ని ఉపయోగించుకొన్నారు. 'నేను పేదదాన్ని గతిలేక చదువు కోసరమని గుంటూరు శారదా మందిరంలో చేరాను. కాని కొన్ని కారణాలవల్ల దాన్ని వదలాలి సొచ్చింది. దగ్గరకు తీసిన రెడ్డిగారు మనవర్తి ఇచ్చి తప్పుకున్నారు. ఈ సంవత్సరం ఏలాగైనా ఎస్. ఎస్. ఎల్. సి అప్లై తే ట్రెయినింగు పొంది పంతులమ్మనౌతాను. దానికి మీ సహాయం...ప్రయివేటు. మీ దయ మీద ఆధారపడ్డది నా బ్రతుకంతాను' వజ్రమ్మ కండ్లలో నీళ్ళు తిరిగి . కాటుక కరగకముందే అద్దివేసి శాస్త్రిగారి వంక దీనంగా చూస్తోంది. 'సరే' నన్నారు శాస్త్రిగారు దీర్ఘాలోచన చేస్తూ. వజ్రమ్మ ముఖం వికసించిపోయింది; కండ్లు మెరిసినై. వక్షం ఉబికింది గోరింటాకు పెట్టుకొన్న రెండు చేతులు జోడించి కొంచెంగా వంగి నమస్కరించింది. చిరునవ్వుతో నిష్క్రమించారు కరటక శాస్త్రిగారు.

* * *

రాత్రంతా నిద్రలేనందున ఉదయం ఏడు గంటలైనా వజ్రమ్మ మంచం దిగలేదు. కిటికీలోగుండా దూరిన సూర్య కిరణాలు వజ్రమ్మ కుడి చెంపమీద డాన్సు చేశాయి. చీకాకుగా కళ్లు తెరిచింది. వరిగి జారిపోయిన పమిటె సరిచేసుకొనే లోపుగానే కరటక శాస్త్రిగారు లోనికి రావడం, 'ఫస్టు ప్రయిజ్! వజ్రం ఫస్టుప్రయిజ్' అనడం ఓ చిటిక వేయడం జరిగింది రేగిన ముంగురులు సరిచేసుకొంటూ ఓరకంటితో ఏమిటన్నట్టు చూసింది వజ్రమ్మ.

'నిన్నటి పోటీవ్యాసరచనలో ప్రథమ బహుమానం నీదే వజ్రం, ఈ విషయాన్నిప్పుడే హెడ్మాస్టరుగారికి చెప్పి ఇలా వచ్చాను. ఏడు గంటలైనా లేవలేదేం వజ్రం! తలుపులు తీసే నిద్రపోతున్నా వేం?'

'దాసీ వొస్తుందని ప్రొద్దున తలుపులు తీశాను. ఏదో మత్తుగా ఉంటే మళ్ళీ పడుకొన్నాను...నిన్న మీరు చెప్పిన పాయింట్సు అన్నీ వ్రాయలేకపోయినాను. సమయానికి జ్ఞాపక మొచ్చాయి కావు.'

'దానికేంలే. నిర్ణయాధికారిని నేనేగా! ఊం ఇంకలే మరి హెడ్మాస్టరుగారింటికి త్వరగా వెళ్ళాలి. నాలుగు వేలకు ఒప్పుకొన్నానని చెప్పేను. డిశంబరు లోగానే మొదటి ప్రీమియం కట్టాలట. ఈ వేళ పూర్తి చేయాలన్నారు. నేను బస్సు దగ్గరకి వెళ్ళి వస్తాను. నీవు త్వరగా పద' అని పురమాయించి కరటక శాస్త్రిగారు కార్యాతురులై తూర్పు దిక్కుగా గబగబ నడిచారు. వజ్రమ్మ ఆవులించి 'నాలుగు వేలకి ఇన్సూరు చేస్తానంటే ప్యాసు చేయించే షరతేగాకుండా ఏమీ వ్రాయకపోయినా ఫస్టు ప్రెయిజ్ కూడా వచ్చిం' దనుకొంటూ పెరటిలోకి వెళ్ళింది.

ఉదయం తొమ్మిది గంటలకల్లా ఉత్తరాన్నించి వజ్రమ్మ దక్షిణాన్నుంచి కరటక శాస్త్రిగారు ఒకేమారు శ్రీవారి ఇంటికి చేరుకున్నారు. ఒకర్ని చూచి మరొకరు మందహాసం చేసుకున్నారు. వడివడిగా లోపలికెళ్ళి శాస్త్రిగారు వజ్రం రాక శ్రీవారికి ఎరిగించారు. ఇన్సూరెన్సు ఫారమ్‌తో శ్రీవారు ప్రత్యక్షమైనారు. వజ్రమ్మ వినయంగా నమస్కరించింది. శ్రీవారు కాగితాలు కరటక శాస్త్రిగారి కందించారు.

'ఎలాగయినా ఈ సంవత్సరం ప్యాసవుతే మీ పేరు చెప్పుకొని ట్రెయినింగు కెళతాను' గొణికింది వజ్రమ్మ.

'అందుకేగా, నీ బ్రతుకు తెరువు కేగా ఈ ప్రయత్నమంతాను' వెల్లడించారు శ్రీవారు.

'నిన్న నేను చెప్పాలెండి—ఇన్సూరెన్సు, దాని ప్రాముఖ్యము, అవసరము, ముందుకలిగే మేలు, ప్రస్తుతపు ప్రత్యేకమైన ప్రయోజనం - అన్నీని' అంటూ స్వామిసేవా తత్పరులైన శాస్త్రిగారు పూర్తిచేసిన కవర్ షీట్‌ను హెడ్మాస్టరుగారి

చేతికందించారు. శ్రీవారు అది సరిగా వున్నదీ లేనిదీ పరిశీలించి ఒకచోట గుర్తుపెట్టి వజ్రమ్మను అచట సంతకం చేయమన్నారు. తదుపరి ముగ్గురూ కలిసి డాక్టరుదగ్గరకు వెళ్ళారు.

భార్య పురిటికి కన్నవారింటికి వెళ్ళినందున శాస్త్రిగారు హోటల్లో భోజనంచేసి, రజాక్ కట్టిన కారాకిళ్ళీ బుగ్గనపెట్టి రాత్రి తొమ్మిది గంటలకు పున్నమనాటి వెన్నెల వెలుగునీడల్లో వజ్రమ్మ ఇంటికెళ్ళారు. దబదబా తలుపు కొట్టేరు. తలుపు కొంచెం ఆలస్యంగానే తెరువబడ్డది. 'దీపమేది?' అంటూ శాస్త్రిగారు లోపలి కడుగుపెట్టారు. 'ఛెళ్ళ్' మన్నది చెంప. అదిరిపోయి అలాగే నిల్చున్నారు. సగం నెరసిన క్రాపింగు జుట్టుపట్టుకొని బలంగా కుదించి వెనక్కునెట్టి వెళ్ళిపోయినాడు ప్రక్కయింటి కారుడ్రైవరు ఏదో గొణుక్కుంటూ. శాస్త్రిగారి దవడ బూరెలాగ ఉబికింది. ఎర్రని రక్త బిందువులు క్రిందికి జారినవా మసకచీకట్లో. మొదటి ప్రీమియం మోసుకుపోతూ గట్టిగా కూసింది దూరాన్నుంచి మెయిల్ బండి. దాని చక్రాల దడదడలు మాత్రం ఒంటరిగా ఉన్న వజ్రమ్మ గుండెల్లో ప్రతిధ్వనించినై.

* * *

మరునాటి ఉదయం తొమ్మిది గంటలు. ఇప్పటి విద్యార్థులకు చదువంటే మహా ఇష్టం గనుక ఇప్పుడే చాలామంది బడికి వచ్చేశారు. శంతనరావూ ఉమాపతీ గదులన్నీ గాలించి ఎలాగైతేనేం ఐదవ తరగతి గదిలో మట్టి కొట్టుకుపోయిన నల్లబల్లను బయటికి తీశారు. ఉమాపతి బల్లను ఏటవాలుగా పట్టుకొన్నాడు. మొదట కాగితాలతోను తరువాత తన జేబుగుడ్డతోను తుడుస్తున్నాడు శంతనరావు. 'ఆ మరకలు అలాపోవు ఆ గుడ్డను తడుపుకు రా.' సలహా ఇచ్చాడు ఉమాపతి. ఎగిరి గంతేసి శంతనరావు ఆపని క్షణంలో చేశాడు. 'మీకింత శ్రద్ధ పుట్టుకొచ్చిందేంరా!' అన్నాడు రంగారావు సిగరెట్ కాలుస్తూ. రెండు నెలల తరువాత మళ్లీ ఆ నల్లబల్ల సంస్కృతంక్లాసు చేరుకొన్నది. గుంపులు గుంపులుగా విద్యార్థులు వచ్చి దాన్ని చూచి నవ్వుకుంటూ పోతున్నారు. పోయినవారు క్రొత్తవారిని తీసుకొచ్చి చూపిస్తున్నారు. తోసుకొంటున్నారు. ఏదో వ్యాఖ్యానిస్తున్నారు. మొదటిగంట మోగింది. వెయ్యిమంది విద్యార్థులు సంస్కృతంక్లాసు ముందు సుడిగుండాలలాగా తిరుగుతున్నారు, నవ్వుతున్నారు. చర్చ చేస్తున్నారు. రెండవగంట మ్రోగింది. ఉపాధ్యాయులు క్లాసు గదుల్లోకి వెళ్లారు గాని పిల్లలు మాత్రం అక్కడ లేరు. అంతా ఏదో ఉషారుగా ఉన్నారు. ఆరడుగులు పొడుగున్న నల్లకరీం అందర్నీ తోసుకొని లోపలికెళ్ళి ఆ నల్లబల్లమీద ఏదో దిద్ది వీరుడిలాగ బయటికి కొస్తున్నాడు. వాకిలి దగ్గర సంస్కృతం మేస్టారు ఎదురైనారు. ఒక్కమాటు నవ్వులు చప్పట్లు, కేకలు, ఈలలు మిన్నుముట్టినై. శాస్త్రిగారు కొయ్యబారి బోర్డుకేసి చూస్తున్నారు. 'చెంబటంత్రమ్' అనే తెల్లని స్పష్టమైన పెద్ద అక్షరాలు నల్లబల్లమీద నాట్యమాడినై. చదువుతున్నారు శాస్త్రిగారు. ముఖం కందగడ్డయిపోయింది. "కరీంగాడు అలా దిద్దాడు, అసలు 'చెంబతంత్రమ్' అని వున్నది లెండి" అన్నాడు ఆచారి ఏదో సద్ది చెప్పినట్లు. గొల్లుమన్నది విద్యార్థిలోకం మరొక్కమాటు. మూడవగంట మ్రోగింది. సాక్షాత్ శ్రీ పాండురంగ విఠల్ స్వామివారిలాగ ప్రధానోపాధ్యాయులవారు పరివార సమేతంగా ఆవరణలో అడుగుపెట్టారు. ఎక్కడి పిల్లలక్కడ మాయమైనారు. ఆ పీరియడ్ సంస్కృతమున్న విద్యార్థులు మాత్రం అక్కడ అలాగే నిలబడి ఉన్నారు. కాస్త గాలితగిలి శాస్త్రిగారికి తెలివి వచ్చింది. మెల్లిగా వెళ్ళి కుర్చీలో కూర్చున్నారు. శ్రీవారు కాన్ఫిడెన్స్ బాక్సుతో సహా లోపలికి తరలి వెళ్ళారు. శోభనాద్రి 'అదేమిటండీ అలా గుడ్డ చుట్టుకొన్నారు!' ప్రశ్నించాడు శాస్త్రిగారి మఫ్లర్ కేసి చూస్తూ. 'సరేలేవోయ్. ఆ బోర్డు తుడు' కోపంగా అన్నారు. 'చెరపడం దేనికండీ! ఈవేళ పాఠమదే చెప్పండి'—ఒక విద్యార్థి కోరాడు. కోపోద్దీపితులై పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ శాస్త్రిగారు హెడ్మాస్టరుగారి గదిలోకివెళ్లారు. వారిని చూడటమే తరువాయి శ్రీవారు కొశ్చన్ పేపర్సు అచ్చువేయించుకు రమ్మని తెనాలి పంపించారు.